క్లుప్తంగా

మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి సారించాలి



మోపాల్: మండలంలోని అన్ని గ్రామపంచాయతీల్లో హరితహారం నర్సరీల్లో మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టిసారించాలని, అధిక ఉష్ణోగ్రతల దృష్ట్యా ప్రతిరోజూ నీరు పట్టాలని ఎంపీడీవో లింగం సూచించారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో బుధవారం ఆయన పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఉపాధిహామీ కూలీల సంఖ్య పెంచేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏపీవో సునీత, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

స్కూల్ యూనిఫామ్‌ల తయారీ ప్రారంభం



మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలకేంద్రంలోని మండల సమాఖ్య కార్యాలయంలో స్కూల్ యూనిఫారాల తయారీ కోసం మహిళా శక్తి కుట్టు కేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఏపీఎం మోహన్ మాట్లాడుతూ.. సుమారు 3వేల యూనిఫారాలు తయారు చేసేందుకు మహిళా సంఘ సభ్యులకు ఒప్పందం కుదిరిందన్నారు. ఒక్కో యూనిఫాంకు రూ.75 ప్రభుత్వం ఇవ్వనుందని తెలిపారు. స్కూళ్లు ప్రారంభమయ్యే లోపు యూనిఫారాలు అందించాలని మహిళా సభ్యులకు సూచించారు.

నిజామాబాద్‌రూరల్ మండలంలో..



నిజామాబాద్‌రూరల్: మండలంలోని మల్కాపూర్(ఎం), గాంధీనగర్ గ్రామంలో బుధవారం స్కూల్ యూనిఫారాల తయారీ సెంటర్‌లను ఐకేపీ ఏపీఎం మహేశ్‌కుమార్ ప్రారంభించారు. గ్రామ అధ్యక్షురాలు, సీసీలు సంతోష్, సుజాత, వీణరాణి, వీవోఏలు మహిళలు, టైలర్స్ పాల్గొన్నారు.

కూలి రూ.600 ఇవ్వాలి



నిజామాబాద్‌రూరల్: ఉపాధి కూలీలకు కొలతలు లేకుండా పని కల్పించి, రోజుకు రూ.600 కూలి ఇవ్వాలని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు చంద్రపుసాయగౌడ్ పేర్కొన్నారు. రూరల్ పరిధిలోని కొత్తపేట, ముత్తకుంట, మల్లారం గ్రామాల ఉపాధి కూలీల సమస్యలపై బుధవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూలీలకు 250 రోజులు పని కల్పించాలని డిమాండ్ చేశారు. పని చేసే ప్రతి ఒక్కరికి జాబ్ కార్డులు ఇచ్చి, పీఎఫ్ ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. గంగమల్లు, గంగారాం, నారాయణ, సాయిబాబాగౌడ్, సాయిలు, మల్కయ్య, పోశెట్టి, వనిత, కళావతి, లలిత, యశోద పాల్గొన్నారు

ఆర్టీసీ డీఎంకు వినతి



బోధన్: ఇటీవల నూతనంగా ఎన్నికైన ఆర్టీసీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రీజినల్ కమిటీ ప్రతినిధుల బృందం బుధవారం బోధన్ ఆర్టీసీ డిపో అధికారులను మర్యాదపూర్వకంగా కలిశారు. డిపో ఉద్యోగుల సమస్యల పరిష్కార అంశాలపై చర్చించి డీఎం శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. త్వరలోనే డిపో ఎంప్లాయిస్ వెల్ఫేర్ కమిటీని ఏర్పాటు చేస్తామని ప్రతినిధులు వెల్లడించారు. ఈ సందర్భంగా డీఎం శ్రీనివాస్, ఎంఎఫ్ హరిప్రసాద్, సీఐ జానాబాయి, పరిపాలనాధికారి గిరి, ఎస్టీఐ లక్ష్మణ్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. వెల్ఫేర్ అసోసియేషన్ రీజినల్ కమిటీ కార్యదర్శి మధుకర్, సహాయ కార్యదర్శి రవీందర్, ఆర్గనైజేషన్ కార్యదర్శి మోహన్, ప్రచార కార్యదర్శి దత్తాత్రి, ఉపాధ్యక్షుడు నవీన్, డిపో ఉద్యోగులు నర్సింలు, రత్నం, దేవేందర్, సురేశ్, లక్ష్మణ్, రాజు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ అందిస్తాం

- ఎన్పీడీసీఎల్ సీజీఎం అశోక్
- సుభాష్‌నగర్ సబ్‌స్టేషన్‌లో నూతన ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం



డిచ్‌పల్లి సబ్‌స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న సీజీఎం



సుభాష్‌నగర్‌లో నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న అధికారులు

నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ నగరవాసులకు నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యమని ఎన్పీడీసీఎల్ సీజీఎం అశోక్ అన్నారు. నగరంలోని సుభాష్‌నగర్ సబ్‌స్టేషన్‌లో ప్రస్తుతం ఉన్న 5.00ఎమ్‌వీఏకు అదనంగా 3.15ఎమ్‌వీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుభాష్‌నగర్ ప్రాంతంలోని హమాల్‌వాడీ, కంఠేశ్వర్, విద్యుత్‌నగర్, బ్యాంక్‌కాలనీ, నాందేవాడ, పాముల బస్తీ ప్రాంతాలకు నాణ్యమైన విద్యుత్‌ను అందించడానికి కెపాసిటి పెంచినట్లు తెలిపారు. ఇందుకు గాను రూ. 40లక్షలు ఖర్చు చేసినట్లు తెలిపారు. ఎస్ఈ రవీంధర్, డీఈలు ఎం శ్రీనివాస్ రావు, రాజేశ్వర్‌రావు, ఏడీఈ తోట రాజశేఖర్, చంద్రశేఖర్, ఏఈ గంగాశేఖర్, సుమిత, గంగారం, ఇలియాస్, దేవిదాస్, గజేంధర్, దశరథ్, రమేష్, సంజీవ్, ప్రేమ్‌లాల్, కృష్ణయ్య, సుదాకర్, తదితరులుపాల్గొన్నారు.

సబ్‌స్టేషన్ తనిఖీ

డిచ్‌పల్లి: మండల కేంద్రంలోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ డిచ్‌పల్లి సెక్షన్ కార్యాలయాన్ని బుధవారం సీజీఎం అశోక్‌కుమార్ సందర్శించి, తనిఖీ చేశారు. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని సిబ్బందికి సూచించారు. వ్యవసాయ ఫీడర్ల ద్వారా రైతులకు అందిస్తున్న విద్యుత్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా విద్యుత్ సరఫరా చేయాలన్నారు. ఎస్ఈ రవీందర్, డీఈ ఉత్తమ్‌కుమార్ జాడే, ఏడీ శ్రీనివాస్, ఏఈ సాయిలు ఉన్నారు.

అందుబాటులో సరిపడా జీలుగ విత్తనాలు



బర్ధిపూర్‌లో మాట్లాడుతున్న ఏడీఏ అనిత

డిచ్‌పల్లి: జిల్లాలోని రైతులకు అవసరమైన జీలుగ (పచ్చిరొట్ట) విత్తనాలు అన్ని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలలో అందుబాటులో ఉన్నాయని జిల్లావ్యవసాయాధికారి కార్యాలయం ఏడీఏ అనిత తెలిపారు. మండలంలోని బర్ధిపూర్ ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (సొసైటీ) లో బుధవారం రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రస్తుతం అన్ని సొసైటీల్లో సరిపడా జీలుగ విత్తనాలు ఉన్నాయని, ఇంకా అవసరం అయితే మరిన్ని జీలుగ విత్తనాలను సొసైటీలకు సరఫరా చేస్తామని అనిత పేర్కొన్నారు. నిజామాబాద్ రూరల్ ఏడీఏ ప్రదీప్ మాట్లాడుతూ.. రైతులు విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు విధిగా డీలర్ల నుంచి రసీదు తీసుకోవాలన్నారు. బర్ధిపూర్ సొసైటీ పరిధిలో 416 బస్తాల జీలుగ విత్తనాలు రైతులు అందించినట్లు ఏవో రాంబాబు తెలిపారు. సొసైటీ చైర్మన్ రామకృష్ణ, ఏఈవోలు అశ్రిత, వంశీకృష్ణ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీని కలిసిన నాయకులు



నందిపేట్: మండలంలోని బీజేపీ నాయకులు ఎంపీ ధర్మపురి అర్వింద్‌ను బుధవారం జిల్లా కేంద్రంలో కలిశారు. ఈ సందర్భంగా ఎన్నికల సరళి గురించి చర్చించారు. స్థానిక సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. ఎంపీని కలిసిన వారిలో పార్టీ మండల అధ్యక్షుడు భూతం సాయిరెడ్డి, ఆరుట్ల రమేశ్, మరంపల్లి గంగాధర్, పెయింటర్ రాజు, నాగ సురేశ్, చిన్నారెడ్డి తదితరులు ఉన్నారు.

అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం



అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎంపీపీ

వర్ని: తాగునీటి సరఫరా శాఖ అధికారుల నిర్లక్ష్యంపై మండల సభలో సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ మేక శ్రీలక్ష్మి వీర్రాజు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఇటీవల గ్రామాల్లో తాగునీటి అవసరాలకు వేసిన బోర్లు స్థానిక ప్రజాప్రతినిధులకు, మండల అధికారు లకు, ప్రజలకు సంప్రదించకుండా ఇరిగేషన్ నీటిపారుదల శాఖ అధికారులు ఇష్టానుసారంగా వేయడంతో వృథా అయ్యాయని ఎంపీపీ మేక శ్రీలక్ష్మి, మండల ఉపాధ్యక్షులు బాలరాజు, జాకోరా ఎంపీటీసీ సాయిలు అధికారులపై మండిపడ్డారు. మిషన్ భగీరథ పైప్ లైన్లు పగిలిపోయి నెలలు కావస్తున్నా మరమ్మతులు చేయడంలో ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రశ్నించారు. సిద్ధాపూర్ రిజర్వాయర్ పనులకు అటవీశాఖ అనుమతులు లేకుండా పనులు ఎలా ప్రారంభించారని జెడ్పీటీసీ హరిదాసు అధికారులను ప్రశ్నించారు. విధులపై నిర్లక్ష్యం చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని సత్యనారాయణపురం ఎంపీటీసీ వెంకట రమణి ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌ను ప్రశ్నించారు. సభకు హాజరుకాని అధికారులపై చర్యలకు సిఫారసు చేయాలని సమావేశంలో తీర్మానించారు. ఎంపీడీవో వెంకటేశ్వర్, తహసీల్దార్ సాయిలు పాల్గొన్నారు.

సకాలంలో పనులను పూర్తిచేయాలి



కంజర్‌లో పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో

మోపాల్(నిజామాబాద్‌రూరల్): ప్రభుత్వ బడుల్లో అమ్మ ఆదర్శ పథకం కింద చేపడుతున్న పనులను సకాలంలో పూర్తిచేయాలని ఎంపీడీవో లింగం నాయక్ సూచించారు. మండలంలోని కంజర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. మండలంలోని 28 పాఠశాలల్లో అభివృద్ధి పనులకు రూ.2.18కోట్ల వరకు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. పనులు నాణ్యతతో చేపట్టాలన్నారు. పనుల్లో నాణ్యత లోపిస్తే తగిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. వీలైనంత త్వరగా అన్ని పాఠశాలల్లో పనులు ప్రారంభించాలని ఆదేశించారు. అనంతరం పలు సూచనలు, సలహాలు చేశారు. పీఆర్ ఏఈ స్రవంతి, జీపీ కార్యదర్శి వెంకటరమణ, హెచ్‌ఎం, సిబ్బంది ఉన్నారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం

నిజామాబాద్‌రూరల్: మండలంలోని కాలూరు గ్రామంలో నవయువ భారత్ యూత్ ఆధ్వర్యంలో బుధవారం క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించారు. నిజామాబాద్ నగరం నుంచేకాకుండా సమీప గ్రామాల్లోని క్రికెట్ జట్లు పాల్గొన్నాయని టోర్నీ నిర్వాహకులు తెలిపారు. రోజుకు రెండు మ్యాచ్‌లు చొప్పున పది రోజుల పాటు టోర్నీ కొనసాగుతుందన్నారు. విజేతకు రూ.11,111, రన్నరప్‌కు రూ.5,555 అందించనున్నట్లు తెలిపారు. ప్రదీప్, సిద్ధార్థ్, శశాంక్, అక్షయ్, అరుణ్, బన్నీ, ప్రశాంత్ ఉన్నారు.

కొరవడిన నాణ్యత.. ధ్వంసమైన రోడ్డు



సిరికొండ మండలంలో తారు లేచిపోయిన రోడ్డు


- ఇటీవల సిరికొండ–తూంపల్లి గ్రామాల మధ్య తారు రోడ్డు వేసిన అధికారులు
- నాలుగు నెలలకే అధ్వానంగా మారిన వైనం



గుంతలమయంగా మారిన రహదారి

సిరికొండ: రోడ్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేస్తుంటే.. అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో కాంట్రాక్టర్లు నాసిరకంగా పనులు చేసి చేతులు దులుపుకుంటున్నారు. దీంతో ఏళ్లపాటు ఉండాల్సిన రోడ్లు మున్నాళ్ల ముచ్చటగా మారుతున్నాయి. ఇటీవల మండల కేంద్రం నుంచి తూంపల్లి వరకు 1.8 కి.మీ తారు రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.77 కోట్ల నిధులు మంజూరు చేసింది. పనులను ఆర్అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. కాంట్రాక్టర్ ఫిబ్రవరిలో పనులు పూర్తి చేశాడు. కానీ నాలుగు నెలలు కూడా గడవకముందే తారు లేచిపోయి, రోడ్డు అక్కడక్కడ ధ్వంసమైంది. అలాగే రోడ్డుకు ఇరువైపులా మొరం వేయకపోవడంతో ఎదురెదురుగా వాహనాలు వచ్చినప్పుడు రోడ్డు కిందికి దిగడానికి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలు రోడ్డు కిందికి దిగి మళ్లీ పైకి ఎక్కుతున్నప్పుడు మొరం లేకపోవడంతో రోడ్డు అంచుల వద్ద తారు లేచిపోతోంది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్ పనులను నాసిరకంగా నిర్మించారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

తారు లేచిపోతోంది..



మా గ్రామానికి ఇటీవల నిర్మించిన రోడ్డు అప్పుడే ధ్వంసమవుతున్నది. తారు సరిగా వేయకపోవడం, రోలింగ్ సరిగా చేయకపోవడంతో అక్కడక్కడ తారు లేచిపోయింది. రోడ్డుకు ఇరుపక్కలా మొరం కూడా పోయలేదు. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలి.

–భీమన్న, తూంపల్లి

మరమ్మతులు చేయిస్తాం..

తూంపల్లి గ్రామానికి వేసిన తారు రోడ్డు అక్కడక్కడ ధ్వంసమైంది. ధ్వంసమైన చోట మరమ్మతులు చేయిస్తాం. రోడ్డుకు సైడ్ మొరం వేయిస్తాం. రహదారి నిర్మాణ పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాం. రోడ్డు నిర్మాణాన్ని నాణ్యతతోనే చేయించాం.

–ప్రవీణ్, ఆర్అండ్‌బీ ఏఈ

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు





జక్రాన్‌పల్లిలో విత్తన కంపెనీలో తనిఖీలు చేస్తున్న ఏవో దేవిక,, ధర్పల్లిలో మాట్లాడుతున్న ఏడీఏ ప్రదీప్

ధర్పల్లి: నకిలీ విత్తనాలు అమ్మే డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని నిజామాబాద్ రూరల్ డివిజన్ వ్యవసాయ అధికారి ప్రదీప్ కుమార్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం విత్తన దుకాణాల డీలర్లకు అవగాహన కార్యక్రమాన్ని ఏవో వెంకటేష్‌తో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ.. విత్తనాలను విక్రయించేటప్పుడు రైతుల వివరాలను రిజిస్టర్లో నమోదు చేయాలని తెలిపారు. ఎమ్మార్పీ కన్నా ఎక్కువ ధరలకు విక్రయిస్తే వారిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. డీలర్లు తప్పనిసరిగా స్టాక్‌బుక్, రిజిస్టర్‌లను మెయింటెన్ చేయాలని సూచించారు. రైతులు లైసెన్స్ ఉన్న డీలర్ల వద్దనే కొనుగోలు చేయాలని అన్నారు. ఏఈవోలు మనోజ్, స్నేహలత, లక్ష్మీ ప్రసన్న లావణ్య, డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి: నకిలీ విత్తనాలు విక్రయించిన విత్తన కంపెనీలపై పీడీ యాక్టు నమోదు చేస్తామని, కఠిన చర్యలు తీసుకుంటామని ఏవో దేవిక తెలిపారు. మండల పరిధిలోని వివిధ విత్తన కంపెనీలలో బుధవారం ఏవో దేవిక, ఎస్సై తిరుపతి ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. రైతులకు నకిలీ విత్తనాలు అమ్మితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. రిటైల్ వ్యాపారులు విత్తనాలను ఎమ్మార్పీ ధరకే విక్రయించాలని సూచించారు.

సిరికొండ: మండలంలోని కుర్దుల్‌పేట్ గ్రామంలో బుధవారం విత్తనాలపై ఏఈవో సతీష్, రైతులకు అవగాహన కల్పించారు. విత్తనాలను ఏవిధంగా ఎంపిక చేసుకోవాలి, విత్తనాలను ఎక్కడ కొనుగోలు చేయాలి అనే విషయాలను ఆయన వివరించారు. లూజ్ విత్తనాలను కొనుగోలు చేయవద్దని, లైసెన్స్ ఉన్న డీలర్ల వద్దనే సరైన విత్తనాలను కొనుగోలు చేయాలని తెలిపారు.

విత్తనోత్పత్తి కర్మాగారం తనిఖీ



సారంగాపూర్ విత్తనోత్పత్తి కర్మాగారాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

నిజామాబాద్‌రూరల్: మండలంలోని సారంగాపూర్ గ్రామంలో గల విత్తనోత్పత్తి కర్మాగారాన్ని సీఐ సురేష్‌కుమార్, ఏవో జాదవ్ హీరా బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కర్మాగారంలో నాణ్యత లోపించిన విత్తనాలు రైతులకు విక్రయించరాదని పేర్కొన్నారు. రైతులకు విత్తనాలు విక్రయించే ముందు విత్తనాలకు సంబంధించిన రశీదును ఇవ్వాలని నిర్వాహకులకు సూచించారు. రైతులు విడి విత్తనాలు కొనుగోలు చేయరాదని ప్రభుత్వంచే గుర్తింపు పొందిన కంపెనీల ద్వారా సరఫరా చేసే విత్తనాలను కొనుగోలు చేయాలని కోరారు. కర్మాగారంలో ఇప్పటి వరకు ఇచ్చిన విత్తనాలకు రశీదులను , బిల్‌బుక్‌లు, రిజిస్టర్లను తనిఖీ చేశారు. పోలీసు సిబ్బంది, ఏఈవోలు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

వైభవంగా శ్రీవారి కల్యాణోత్సవం



నిజామాబాద్‌అర్బన్: నగరంలోని ఖిల్లా రఘునాథ ఆలయం వద్ద బుధవారం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా పండితులు కందాలై నరసింహమూర్తి, నాని స్వామి ఆధ్వర్యంలో స్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు, కల్యాణోత్సవం నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నప్రసాదం అందించారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ ముక్కా దేవేందర్ గుప్తా, సభ్యులు తాటి వీరేశం దాతలకు సన్మానం నిర్వహించారు. వేడుకల్లో పలు జంటలు పాల్గొన్నాయి.

ఆలయ హుండీ లెక్కింపు



నిజామాబాద్‌రూరల్: నగరంలోని మాధవనగర్ సాయిబాబా ఆలయ హుండీని బుధవారం లెక్కించారు. దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ సుప్రియ, ఆలయ ఏవో శ్రీరాంరవీందర్‌గుప్తా ఆధ్వర్యంలో హుండీలను తెరిచారు. రెండు నెలల నాలుగు రోజుల్లో హుండీ ద్వారా రూ.3,02,485 ఆదాయం వచ్చినట్లు సహాయ కమిషనర్ పేర్కొన్నారు. ఆలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జగన్నాథ శోభాయాత్ర



నవీపేట: మండల కేంద్రంలో బుధవారం రాత్రి నిర్వహించిన జగన్నాథ శోభాయాత్ర భక్తులను ఆకట్టుకుంది. భగవద్గీత శ్లోకాలతో పాటు భక్తి పాటలతో వీధుల గుండా నృత్యాలు చేశారు. భగవద్గీతపై అవగాహన కల్పించేందుకు ఈ శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు ఇస్కాన్ ప్రతినిధులు పేర్కొన్నారు. రామానందగౌరవ ప్రభూజీ, లోకేష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు

పెర్కిట్: ఆలూర్ మండలం దేగాం గ్రామంలో దళిత గోవిందంలో భాగంగా దళితవాడలో ఉన్న వేంకటేశ్వర స్వామి భజన మండపానికి తిరుమల తిరుపతి దేవస్థానం వారు రూ.10 లక్షల నిధులు మంజూరు చేశారు. ఈ మేరకు టీటీడీ శ్రీవారి ట్రస్టు నిధుల నుంచి రూ.10లక్షలు మంజూరు చేస్తూ బుధవారం తెలంగాణ దేవాదాయ శాఖ నిజామాబాద్ అసిస్టెంట్ కమిషనర్‌కు ప్రొసీడింగ్ కాపీని పంపారు. ఎన్నికల కోడ్ ముగిసిన అనంతరం మంజూరైన నిధులతో మండప నిర్మాణాన్ని ప్రారంభించనున్నట్లు బీజేపీ ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బండారి యాదగిరి తెలిపారు.

ఉపాధ్యాయుల బడిబాట

బాల్కొండ: తల్లితండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరుతూ ముప్కాల్ మండల ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు బుధవారం బడిబాట నిర్వ హించారు. ఈ సందర్భంగా ముప్కాల్, వేంపల్లి, నల్లూర్ గ్రామాల్లో ఇంటింటా తిరుగుతూ ప్రభుత్వ పాఠశాలలకు ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, గతేడాది విద్యార్థులు సాధించిన విజయాల గురించి వివరించారు. సర్కార్ బడిలో చదివితేనే పిల్లలు ఉన్నత స్థాయికి చేరుతారని అన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గంగాధాం, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	73,500	వెండి (కిలో)	95,000
22 క్యారెట్స్	67,082	– నిజామాబాద్ బిజినెస్	

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	200
		లైవ్	180
స్కిన్‌లెస్	240	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	24	40	గాజరుగడ్డ	30	50
బెండకాయ	20	40	పచ్చిమిర్చి	50	80
బీరకాయ	40	70	దోసకాయ	15	30
దొండకాయ	20	40	ఆలుగడ్డ	25	40
జిర్నికాయ	120	150	గోబిగడ్డ	20	40
కాకరకాయ	40	60	గోబిపువ్వు	20	40
వంకాయ	15	30	బీట్‌రూట్	20	40
పాలకూర	30	50	కరివేపాకు	40	70
మెంతికూర	50	80	చామగడ్డ	40	70
కొత్తిమీర	100	130	గోరుచిక్కుడు	70	100
పుదీనా	60	80	చిక్కుడుకాయ	80	100
క్యాప్సికం	40	60			

– సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లీష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-2	ఆ ఒక్కటీ అడక్కు(తెలుగు)-11.00, 4.30,10.30 లవ్‌మీ(తెలుగు)-1.45 7.30 ఫ్యూరియస్ మ్యాడ్ మాక్స్-(ఇంగ్లీష్)-4.45
స్క్రీన్-3	ఫ్యూరియోసా(తెలుగు)-10.45,10.40 బాక్(తెలుగు)-1.45 రాజుయాదవ్(తెలుగు)-4.40 ,7.45

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	ఫ్యూరియస్ మ్యాడ్ మాక్స్ (తెలుగు)-1.15, ఫ్యూరియస్ మ్యాడ్ మాక్స్ (ఇంగ్లీష్) - 4.30, 7.45, 11.00
స్క్రీన్-2	శ్రీకాంత్ (హిందీ) - 1.15, లవ్‌మీ(తెలుగు)-4.00,10.10 ఫ్యూరియోసా(తెలుగు)-6.55
స్క్రీన్-3	డర్టీ ఫ్లవర్ (తెలుగు) - 1.25, ఆ ఒక్కటీ అడక్కు (తెలుగు) - 4.05, శ్రీకాంత్ (హిందీ) - 7.00, సీడీ (క్రిమినల్ ఆర్ డెవిల్ (తెలుగు) - 10.00
స్క్రీన్ -4	బిగ్ బ్రదర్ (తెలుగు) - 11.25, సిల్క్ సారీ (తెలుగు) - 2.00, రాజు యాదవ్ (తెలుగు) - 7.50, 10.30
దేవి	రాజు యాదవ్
నటరాజ్	ఫ్యూరియస్ మ్యాడ్ మాక్స్ (తెలుగు)
విజయ్	లవ్‌మీ(తెలుగు)